క్లుప్తంగా

రబీ పంటలకు బీమా చేయించుకోవాలి

నరసన్నపేట: రబీ పంటలకు ఈ నెలాఖరు వరకు బీమా చేయించుకోవచ్చని నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి అన్నారు. మండలం చోడవరంలో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు బీమాపై అవగాహన కల్పించారు. రబీ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఏఓ కె.సునీత మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. యూరియా ఎవరికైనా కావాలంటే సమాచారం ఇవ్వాలని కోరారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బూర్జ: మండలంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరగా నిర్మించాలని హౌసింగ్ డీఈ ధర్మాన సన్యాసిరావు అన్నారు. మండలంలోని అల్లెన గ్రామంలో మంగళవారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూర్జలోని హౌసింగ్ కార్యాలయంలో వర్క్ఇన్స్‌పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అన్ని సచివాలయాల్లో నూతనంగా ఇళ్ల మంజూరు కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏఈ కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా సీపీఐ



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

నరసన్నపేట: ప్రజలకు అండగా సీపీఐ పార్టీ ఉంటుందని, వారి తరఫున అనేక ఉద్యమాలు చేసిందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు తెలిపారు. నరసన్నపేటలో మంగళవారం సీపీఐ శత వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం సాధనలో సీపీఐ భాగస్వామ్యం అయిందని, భూ సంస్కరణలు చట్టం కోసం పోరాడి లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ అయ్యేందుకు కృషి చేసిందన్నారు. ఇప్పుడు కూడా పేదల పక్షాన పార్టీ పనిచేస్తోందని తెలిపారు. భారత గడ్డపై ఎర్ర జెండాకు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు నెయ్యిల నారాయణరావు, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ప్రభుత్వ ఉద్యోగులు



అనాథ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ, తదితరులు

నరసన్నపేట: మండలంలోని అంతర రాష్ట్ర రహదారికి ఆనుకొని జమ్ము సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వద్ద మంగళవారం అనాథ (గుర్తుతెలియని) మృత దేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహం ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఎటువంటి ఆనవాళ్లు లభించ లేదు. మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో పోలీసులు, పంచాయతీ సిబ్బంది మానవతా దృక్పథంతో స్పందించి ఖననం చేశారు. ఏఎస్‌ఐ అసిరినాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

పొందూరు: ధ్యానం ద్వారా ఆనందకరమైన స్థితికి చేరుకోచ్చునని వరదయ్యపాలెం ఏకం క్షేత్రం ప్రతినిధి చంద్రశేఖర్ దాసాజీ అన్నారు. మంగళవారం స్థానిక పట్టుశాలి కల్యాణ మండపలంలో ఏర్పాటు చేసిన ఏకం అనుగ్రహ ఆధ్యాత్మిక జాగ్రుతి కార్యక్రమంలో పాల్గొని మార్గదర్శనం చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నిశ్చలమైన ప్రార్థన దోహదం చేస్తుందన్నారు. ఐశ్వర్యం అంటే ధనం ఒక్కటే కాదని స్నేహితులు, శ్రేయోభిలాషులు కూడా సంపద కిందకే వస్తారన్న సత్యాన్ని గ్రహించాలన్నారు. వివిధ మండలాలకు చెందిన సాధకులు, ధార్మిక సేవకులు పాల్గొన్నారు.

హోటల్‌లో గోమాంసం పట్టివేత



హోటల్ వద్ద మాట్లాడుతున్న కరాటే కల్యాణి

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకొని తామరాపల్లి వద్ద ఒక హోటల్‌లో గో మాంసం పట్టుబడింది. ధార్మిక పరిషత్ రాష్ట్ర ప్రతినిధి, సామాజిక కార్యకర్త సినీ నటి కల్యాణి మంగళవారం ఇచ్ఛాపురం నుంచి వస్తూ ఈ హోటల్ వద్ద భోజనానికి ఆగారు. హోటల్ యజమాని గోమాంసం ఉందని చెప్పడంతో ఆమె షాక్‌కు గురై వెంటనే జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన నరసన్నపేట పోలీసులు హోటల్ వద్దకు వచ్చి ఆమెతో మాట్లాడారు. గో మాంసాన్ని కల్యాణి వారికి చూపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగంగా గో మాంసం విక్రయాలు, వండి వడ్డించడం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి నరసన్నపేట ఏఎస్‌ఐ అసిరినాయుడుతో మాట్లాడగా దీనిపై కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

బిక్కుబిక్కుమంటూ..!



శిథిలావస్థలో షలంత్రి పశువైద్య కేంద్రం

- శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రాలు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న వైద్యులు, సిబ్బంది
- మందులు, రికార్డులకు భద్రత కరువు

సరుబుజ్జిలి:

గత ప్రభుత్వ హయాంలో పశువుల వైద్యం కోసం ప్రతీ రైతు భరోసా కేంద్రం పరిధిలో పాడి సంపదకు సత్వర సేవలే లక్ష్యంగా ఉద్యోగుల నియామకంతోపాటు, నూతన భవనాల నిర్మాణం, పూర్తిస్థాయి మందులు అందించారు. ప్రస్తుతం ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ, ఆమదాలవలస మండలాల్లోని పలు పశువైద్య కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి.

ఆస్పత్రు పరిస్థితి ఇలా..

ఆమదాలవలస ప్రాంతీయ పశువైద్య కార్యాలయంలోని రెండు భవనాలూ శిథిలమయ్యాయి. ఆమదాలవలస మండలంలోని వంజంగి, దూసి భవనాలు శిథిలాస్థకు చేరుకున్నాయి. పొందూరులో తోలాపి, లోలుగు, బూర్జ మండలం అల్లెన, సరుబుజ్జిలి మండలం షళంత్రి పశువైద్య కేంద్రాలు పూర్తిగా జీర్ణోద్ధారణ స్థితికి చేరుకున్నాయి.

పాడవుతున్న మందులు..

శిథిలభవనాలు కావడం వలన వర్షాలు పడే సమయంలో మందులు తడిసి ముద్దవుతున్నాయి. రికార్డులకు కూడా భద్రత లేకుండా పోతుంది. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రాలు వద్ద సరైన వసతులు లేకపోవడం వలన చికిత్స కోసం పశువులను తెస్తున్న పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఆమదాలవలస నియోకవర్గంలోని పశువైద్య కేంద్రాల వివరాలు			
మండలం	ఆస్పత్రులు	గ్రామీణ కేంద్రాలు	ఆర్ఎస్‌కేలు
సరుబుజ్జిలి	3	0	7
పొందూరు	2	2	27
బూర్జ	0	4	16
ఆమదాలవలస	5	0	9

ఆమదాలవలస నియోజకవర్గంలోని మూగజీవాల వివారాలు				
మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
సరుబుజ్జిలి	9,480	88	9,456	4,059
పొందూరు	14,834	596	24,412	8,241
బూర్జ	10,560	38	11,658	2,542
ఆమదాలవలస	11054	664	11,842	2,910

పక్కా భవనాలు నిర్మించాలి



చాలాచోట్ల పశువైద్య కేంద్రాలకు పక్కాభవనాలు లేవు. పాడైన భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహించడం వలన వారికి ఇబ్బంది కలుగుతుంది. మందులు జాగ్రత్త చేసేందుకు సరైన సదుపాయాలు కల్పించాలి. మందులకు కొరత లేకుండా చూడాలి.

– బి.రామారావు,పాడిరైతు, పెద్దసవలాపుం

ఉన్నతాధికారులకు నివేదించాం



చాలాచోట్ల పశువైద్యకేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికే వాటన్నింటినీ పరిశీలించాం. పూర్తి వివరాలతో కూడిన నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరుచేసిన తక్షణమే భవనాల పనులు ప్రారంభిస్తాం.

– సి.హెచ్.సుబ్రహ్మణ్యం, ఏడీ, పశుసంవర్ధకశాఖ, సరుబుజ్జిలి

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సరుబుజ్జిలి: అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై తమ పక్షాన పోరాటాలు చేయాలని పీఆర్ మినిస్ట్రీరియల్ ఉద్యోగం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గజపతిరావు కోరారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మంగళవారం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పీఆర్ సంఘం తరఫున వినతిపత్రం అందించారు. అటెండర్ కేడర్ నుంచి రికార్డ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి విషయంపై ప్రభుత్వంతో పోరాటం చేయాలని, కొత్త పోస్టులు నియామకం చేయకపోవడం వలన కొన్నిచోట్ల ఉపాధ్యాయులే ఆయా పనులు చక్కబెడుతున్నారని వెల్లడించారు. వినతిపత్రం అందించినవారిలో పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భైరి అప్పారావు, స్థానిక హెచ్ఎం టీవీఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు లావేటి గోపి, కంచరాన రామకృష్ణ, ఎం.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్లుగా ఎంపిక





వాబ యోగి | కళింగపట్నం అప్పన్న | ధనుంజయరావు

సారవకోట: ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీలో మండలానికి చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. ఎస్టీ విభాగం నుంచి సారవకోటకు చెందిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగికి, ఎస్సీ విభాగం నుంచి అలుదు గ్రామానికి చెందిన కళింగపట్నం అప్పన్నకు చోటు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి ఎంపికపై పలు సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందన తెలిపారు.

ఆమదాలవలస నుంచి..

ఆమదాలవలస: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ మెంబర్‌గా మండల కన్స్యూమర్ ఫోరం అధ్యక్షుడు, ఆమదాలవలస పట్టణానికి చెందిన టి.ధనుంజయరావును ప్రభుత్వం నియమించింది. ధనుంజయరావుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: క్రీస్తు జన్మదినం సందర్భంగా బుధవారం క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించుకుంటున్న క్రైస్తవులందరికీ పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏసు ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు.

యాజమాన్య పద్ధతులతో మేలు

మెళియాపుట్టి: రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు అన్నారు. మంగళవారం మండలంలోని పూలసార, రంగంపుటి గ్రామాల్లో రైతులకు సలహాలు, సూచనలను అందించారు. రబీలో పండించే మినుము, పెసర, వేరుశెనగ, మొక్కజొన్న, నువ్వు పంటల్లో అధిక దిగుబడులు రావడానికి, పంట సంరక్షణ చర్యల గూర్చి వివరించారు. ఈ నెల 26వ తేదీ వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలన్నారు. ఏఓ ధానకర్ణుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో ప్రార్థనా మందిరాలు మెరిసిపోతున్నాయి. ఏటా డిసెంబర్ 25న బాల ఏసు పుట్టిన రోజును పురస్కరించుకుని, క్రిస్మస్ పండగ నిర్వహిస్తున్నారు. 24వ తేదీ అర్ధ రాత్రి నుంచే ఉత్సవాలు ఆరంభమయ్యాయి. పలుచోట్ల క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి, లోక రక్షకుడైన ఏసు సందేశాన్ని మతబోధకులు చదివి వినిపించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: గాజులకొల్లివలస చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ రాడ విజయ్‌కుమార్, తదితరులు



నరసన్నపేట: శర్వాణి స్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



సరుబుజ్జిలి: యరగాం క్రైస్ట్ యూనివర్సల్ చర్చిలో కేక్‌ను కట్ చేస్తున్న క్రైస్తవులు



బూర్జ: కొల్లివలసలోని సీడబ్ల్యూసీ చర్చ్



పాతపట్నం: సీహెచ్‌సీలో కేక్‌ను కట్ చేస్తున్న వైద్యుడు వేణుగోపాల్



పొందూరు: పొందూరు సీఎంసీ చర్చి వద్ద క్రిస్మస్ వేడుకలు



పొందూరు: క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



పాతపట్నం: విద్యుత్ కాంతులతో ఆర్‌సీఎం చర్చి



హిరమండలం: డీఎస్ఆర్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన పశువుల పాక



కొత్తూరు: ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి

కలశాలతో ఊరేగింపు



సరుబుజ్జిలి పురుషోత్తపురం గ్రామంలో భవానీ భక్తులు మంగళవారం కలశ జ్యోతి ఉత్సవం నిర్వహించారు. 41 రోజులు భవనీ దీక్షలు ముగింపు సందర్భంగా సన్నిధానంలో విశేషమైన పూజలు, కుంకుమార్చనలు, హోమాలు అందుకున్న దుర్గమ్మవారి కలశాలను ఊరేగించారు. సమీపంలోని వంశధార నదీతీరంలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు ఇరుముడిధారణ చేపట్టి విజయవాడ అమ్మవారి దర్శనానికి బయలుదేరారు.

– సరుబుజ్జిలి

పాఠశాల సమీపంలోనే చెత్త ..



సారవకోట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో చెత్తకుప్ప ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వచ్చి, వెళ్లే సమయాల్లో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. విద్యార్థులు రోగాల బారినపడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సారవకోట

రోడ్డు పనుల్లో డొల్లతనం



విరిగిన పైపులైన్ దగ్గర బయటకు వస్తున్న నీరు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ ముంజువానిపేట నుంచి బెజ్జి గ్రామానికి పల్లె పండగ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా పైపులైన్లు వేశారు. పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైపులు పగిలిపోయాయి. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలోనే పైపులైన్ విరిగిపోతే భవిష్యత్‌లో ఈ రోడ్డు పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు వివరణ కోరగా.. రోడ్డు పనులు చేపడుతున్నారని, వాహనాల రాకపోకల వలన పైపులైన్లు పాడయ్యాయన్నారు. మరలా పైప్‌లైన్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రవికుమార్, పార్టీ నాయకులు

- ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఎన్నికల ముందు చంద్రబాబు అనేక మోసపూరిత ప్రకటనలు చేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. ఈ నెల 27న 'కరెంట్ చార్జీల బాదుడు'పై పోరుబాట నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నియోజకవర్గ నాయకులతో కలిపి ఆమదాలవలసలో మంగళవారం విడుదల చేశారు. రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను వీలైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో అనేక సభల్లో మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పదిహేను వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపడం చంద్రబాబు మోసపూరిత పాలనకు నిదర్శనమన్నారు. 27వ తేదీ ఉదయం 10 పంటలకు ఆమదాలవలస రైల్వే స్టేషన్ దరిలో గల వన్‌వే జంక్షన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సువ్వారి నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు

పాతపట్నం: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం మండల అధ్యక్షుడిగా బి.మురళీకృష్ణం నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాయంలో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పి.శ్రావణి, సెక్రటరీగా ఎం.అలేఖ్య, ట్రజరీగా కె.శామ్యూల్ వస్లీ, జాయింట్ సెక్రటరీగా ఎం.సునీల్ కుమార్, డివిజనల్ కమిటీ మెంబర్‌గా బి.అన్నాజీరావు, జిల్లా కమిటీ మెంబర్‌గా కె.ఈశ్వరరావును ఎన్నుకున్నారు. నూతన కమిటీని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, డీటీ బి.వెంకటరమణ, సీఎస్‌డీటీ బి.ప్రసాదరావు, ఎలక్షన్ డీటీ వి.శంకర్, మండల సర్వేయర్ బి.రామగణపతి, ఆర్ఐ పి.బాబీ అభినందించారు.

ప్రజలపై భారం మోపడం తగదు



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాటి నుంచి విద్యుత్ చార్జీలతోపాటు నిత్యావసరాలు పెరిగిపోయాయని కొత్తూరు మండలం పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో విలేకర్లతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వడమ శ్రీనివాసరావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ దూళి అప్పన్న పాల్గొన్నారు.